87వ అధ్యాయం

# ٨٧ - بَابُ الأَمْرِ بِالْمُحَافَظَةِ عَلَى مَا اعْتَادَهُ مِنَ الْخَيْرِ

# మంచి అలవాట్లను కొనసాగించాలి

قال الله تعالى: ﴿إِنَّ اللَّهَ لَا يُغَيِّرُ مَا بِقَوْمٍ حَتَّىٰ يُغَيِّرُوا مَا بِأَنفُسِهِمْ﴾ [الرعد: ١١]. وقال تعالى: ﴿وَلَا تَكُونُوا كَالَّتِي نَقَضَتْ غَزْلَهَا مِن بَعْدِ قُوَّةٍ أَنكَاثًا﴾ [النحل: ٩٢]. «وَالأَنْكَاثُ» جَمْعُ نِكْثٍ، وَهُوَ الْغَزْلُ الْمَنْقُوضُ. وقال تعالى: ﴿وَلَا يَكُونُوا كَالَّذِينَ أُوتُوا الْكِتَابَ مِن قَبْلُ فَطَالَ عَلَيْهِمُ الْأَمَدُ فَقَسَتْ قُلُوبُهُمْ﴾ [الحديد: ١٦]. وقال تعالى: ﴿فَمَا رَعَوْهَا حَقَّ رِعَايَتِهَا﴾ [الحديد: ٢٧].

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు :

"యదార్థం ఏమిటంటే, ఒక జాతి స్వయంగా తన లక్షణాలను మార్చుకోనంతవరకు అల్లాహ్ దాని స్థితిని మార్చడు." *(అర్రాద్ : 11)*

"స్వయంగా తాను శ్రమతో నూలు వడికి, తరువాత తానే దానిని ముక్కలు ముక్కలుగా చేసిన స్త్రీ స్థితిలాగా మీ పరిస్థితి కాకూడదు." *(అన్ నహ్ల్ : 92)*

"పూర్వం గ్రంథం ఇవ్వబడిన ప్రజల మాదిరిగా విశ్వాసులు మారిపోకూడదు. ఒక సుదీర్ఘ కాలం వారిపై గడిచిపోయింది. అప్పుడు వారి హృదయాలు కఠినమయ్యాయి." *(అల్ హదీద్ : 16)*

"వారు దానిని పాటించే విషయంలో న్యాయం చేకూర్చలేకపోయారు." *(అల్ హదీద్ : 27)*

## వివరణ

అల్లాహ్ మానవులకు రాజ్యం, అధికారం, సిరిసంపదలు, గౌరవమర్యాదలు లాంటి అనుగ్రహాలు ప్రసాదించి పరీక్షిస్తాడు. అందుకు వారు కృతజ్ఞతలు తెలుపుకుంటే వారికి మరిన్ని అనుగ్రహాలు ప్రసాదిస్తాడు. అదే కృతఘ్నతా వైఖరికి పాల్పడితే ఇచ్చిన వరాలను కూడా లాక్కుంటాడు - ఇది మొదటి సూక్తికి భావం. రెండవ సూక్తిలో మంచిమార్గాన్ని వదలి చెడు మార్గాన్ని అవలంబించటాన్ని ఎంతో శ్రమతో నూలువడికి తర్వాత స్వయంగా దానిని ముక్కలు ముక్కలుగా చేసే ఉదాహరణతో పోల్చిచెప్పటం జరిగింది. మూడో సూక్తిలో ప్రత్యేకంగా విశ్వాసులను గ్రంథవహుల పోకడలకు దూరంగా ఉండమని హితబోధచేయటం జరిగింది. గ్రంథవహులంటే యూదులు, క్రైస్తవులు, దైవగ్రంథం అవతరింపజేయబడినవారు. వీరు ముందు దైవాదేశాలను పాటించారు. కాని కొంతకాలం తర్వాత ప్రాపంచిక సుఖాలకు దాసులయిపోయి దైవాదేశా

లను నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా వారి హృదయాలు కఠినమైపోయాయి. వారిలో చాలామంది అవిధేయులయ్యారు. నాల్గవ సూక్తిలో కూడా వీరి గురించే చెప్పబడింది. వీరు ధర్మంలో లేని వేదాంతమార్గాన్ని స్వయంగా సృష్టించుకున్నారు. తర్వాత దాన్ని పాటించనూ లేకపోయారు.

మొత్తానికి పై సూక్తుల ద్వారా చెప్పొచ్చేదేమిటంటే మనిషి పుణ్యప్రదమైన మార్గాన్ని ఎల్లప్పుడూ అంటిపెట్టుకొని ఉండాలి. మధ్యలో దాన్ని వదలిపెట్టడం చాలా ప్రమాదకరం.

٦٩٢ - وعن عبدِ اللهِ بن عمرِو بن العاص رضي الله عنهما قال: قال لي رسولُ اللهِ ﷺ: «يَا عَبْدَ اللهِ! لا تَكُنْ مِثْلَ فُلانٍ، كَانَ يَقُومُ اللَّيْلَ فَتَرَكَ قِيَامَ اللَّيْلِ» متفقٌ عليه.

692. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం : ఒకసారి దైవప్రవక్త (సల్లం) నన్ను సంబోధిస్తూ, "ఓ అబ్దుల్లాహ్! ఫలానా వానిలా అయిపోమాకు. అతను రాత్రిళ్ళు నిద్రలేచి ఆరాధన చేసేవాడు. ఆ తర్వాత అతను నిద్రలేవటం మానుకున్నాడు" అని అన్నారు.

*(బుఖారీ - ముస్లిం)*

(సహీహ్ బుఖారీలోని తహజ్జుద్ ప్రకరణం, సహీహ్ ముస్లింలోని ఉపవాసాల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

మనిషి ఏదయినా మంచిపని చేయటం ప్రారంభిస్తే దాన్ని అలాగే కొనసాగిస్తూ ఉండాలి. మధ్యలో ఆ పనిని మానుకోకూడదు. మంచి పనుల్ని మధ్యలోనే విరమించుకునే మనిషి తనకు తెలియకుండానే చెడు వైపునకు మొగ్గే ప్రమాదముంది. ఆరంభించిన మంచి పనిని స్థైర్యంతో, నిలకడగా కొనసాగించటంలోనే మనిషి విజయం, క్షేమం దాగి ఉంది.